క్లుప్తంగా

క్రీడామైదానం ఏర్పాటు చేయండి



అయిజ: మండలంలోని తొత్తినోనిదొడ్డి ప్రాథమికోన్నత పాఠశాలకు క్రీడా మైదానం లేకపోవడంతో పాఠశాల భవనం ముందు ఉన్న కొద్దిపాటి స్థలంలో ఆడుకునేందుకు విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. క్రీడామైదానం ఏర్పాటు చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజా ప్రతినిధులకు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పాఠశాల మైదానం ఏర్పాటు చేయడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. పాఠశాలకు క్రీడామైదానం ఏర్పాటు చేసి ఆటవస్తువులు అందజేస్తే విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభ బయటపడుతుందని, క్రీడా మైదానాలు లేకపోవడం వల్ల విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతభను గుర్తించలేకపోతున్నామని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

జెడ్పీ కోఆప్షన్ సభ్యుడి సేవలు మరువలేనివి



రాజోళి: జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడిగా మండల కేంద్రానికి చెందిన నిషాక్ సమస్యల పరిష్కారానికి ఎంతో కృషి చేశారని స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల పూర్వ విద్యార్థులు తెలిపారు. 1998లో జిల్లా పరిషత్ పాఠశాలలో చదివిన విద్యార్థులు మాజీ జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు నిషాక్‌ను శనివారం పూల మాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. సాధారణ చేనేత కార్మికుడిగా ఉంటూ, చేనేత సమస్యలతో పాటు, మండలంలో ఉన్న పలు సమస్యలపై స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డుకు మరమ్మతు చేయండి



అయిజ: కొన్ని సంవత్సరాల క్రితం అయిజ నుంచి ఉప్పలకు ఏర్పాటు చేసిన బీటీ రోడ్డు శిథిలమైనా పాలకులు, అధికారులు పట్టించుకోవడంలేదు. రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడడంతో వాహనాలపై ప్రయాణించడం ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డుపై ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి అనేకసార్లు ప్రమాదాలు జరిగాయి. ప్రాణనష్టం జరగకముందే అధికారులు స్పందించి వెంటనే రోడ్డుకు మరమ్మతు చేపట్టాల్సిన అవసరం ఉంది.

మౌలాలికి ప్రత్యేక పూజలు



ఉండవెల్లి: మండల కేంద్రం, తక్కశిల, ప్రాగటూరు, మెన్నిపాడు, భైరాపురం, కలుగోట్ల, పుల్లూరు గ్రామాల్లో మొహర్రం సందర్భంగా పీర్లను దర్గాలలో ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. శనివారం మౌలాలి స్వామి పీర్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాయి గుంతలలో నడిపించి, ఊరేగిస్తారు. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



అయిజ: మండల కేంద్రంలో శనివారం వీచిన ఈదురు గాలులకు నరసింహ కాలనీలో వేపచెట్టు నేలకొరిగింది. అక్కడే పార్కింగ్ చేసిన కారుపై చెట్టు కొమ్మలు పడడంతో కారు అద్దాలు ధ్వంసమయ్యాయి. పక్కనున్న విద్యుత్ తీగలపై చెట్టు పడడంతో విద్యుత్ స్తంభం విరిగింది. విద్యుత్ తీగలు కిందికి వాలాయి. అధికారులు వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపేశారు. చెట్టు విరిగిన సమయంలో ఆ ప్రదేశంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది.

జీపీ కార్మికులకు జీతాల్లేవు



ధరూరులో పారిశుద్ధ్య పనులు చేస్తున్న పంచాయతీ కార్మికులు

- ఏడు నెలలుగా నిరీక్షణ
- కుటుంబాలు గడవక తీవ్ర ఇబ్బందులు
- ప్రత్యేక అధికారుల పాలనలోనూ అందని వేతనాలు

ధరూరు: గ్రామ పంచాయతీ కార్మికులకు ఏడు నెలలుగా జీతాల్లేవు. ప్రజా ప్రతినిధుల పదవులు ముగిసి, ప్రత్యేక అధికారుల పాలన మొదలైనా వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. నెలనెల వచ్చే జీతంతోనే కుటుంబాలను పోషించుకునే కార్మికులు ఏడు నెలలుగా జీతాల్లేక అప్పులు చేసుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారు.

ప్రతిరోజు ఉదయం 6 గంటలకు గ్రామాల్లో పరిశుభ్రత కోసం పనులు ప్రారంభించి, సాయంత్రం వరకు బిజీబిజీగా ఉంటున్నారు. మండల కేంద్రంలో 20 మంది పంచాయతీ కార్మికులు పని చేస్తున్నారు. గ్రామంలో చెత్తను సేకరించి గ్రామ శివారులో ఉన్న డంపింగ్ యార్డులో పారబోస్తున్నారు. మురుగు కాల్వలను శుభ్రం చేయడంలో కీలకంగా పని చేసి గ్రామాన్ని అందంగా తీర్చిదిద్దుతున్నారు. ట్రాక్టర్, తోపుడు బండ్ల ద్వారా నిత్యం పట్టణాల తరహాలో చెత్తను ఇంటింటికి వెళ్లి సేకరిస్తున్నారు.

వేతనాలు అందక ఇబ్బందులు..

ప్రభుత్వ ఉద్యోగులు ప్రతినెల వేతనాలపైనే ఆధారపడి జీవనాన్ని కొనసాగిస్తారు. తాము కూడా ప్రభుత్వం ఇచ్చే వేతనాలతోనే కుటుంబాలను పోషించుకుంటున్నాం. ఏడు నెలలుగా జీతాల్లేక అప్పుల పాలవుతున్నామని కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ జీవనం కొనసాగడం కష్టంగా ఉందని, తమకు వేతనాలు చెల్లించాలని పలు మార్లు ధర్నాలు, వినతి పత్రాలు అందజేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిధుల కొరత వల్ల అందలేదు

నిధుల కొరత కారణంగా కార్మికుల వేతనాలు నిలిచిపోయిన మాట వాస్తవమే. ప్రభుత్వం నిధులు విడుదల చేయగానే కార్మికుల అకౌంట్లలో జమ చేస్తాం. వేతనాల విషయమై రెండు రోజుల క్రితమే హైదరాబాద్‌లో ధర్నా నిర్వహించారు. – రాధాక్రిష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి, ధరూరు

వేతనాలు రాక ఇబ్బందులు



కొన్నేళ్లుగా పంచాయతీ కార్మికులుగా పని చేస్తున్నాం. మాకు 7 నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదు. అధికారులను అడిగినా పట్టించుకోవడం లేదు. ఏం చేయాలో తోచడం లేదు. ఎవరిని అడిగినా వస్తాయంటారు, కానీ రావడం లేదు.
– బతుకన్న, పంచాయతీ కార్మికుడు, ధరూరు

అధికారులు పట్టించుకోవాలి..



పని చేసిన వేతనాలు సకాలంలో రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. సర్పంచు పాలన సమయంలో మూడు నెలల వేతనాలు రావాల్సి ఉంది. ప్రస్తుతం స్పెషలాఫీసర్ల పాలన నడుస్తోంది. వాళ్లను అడిగితే ఫల్ పైకిపంచాం.. వచ్చాక వేతనాలు ఇస్తాం అంటున్నారు.
– సవారన్న, పంచాయతీ కార్మికుడు, ధరూరు

నెలనెలా అందించాలి..



మాకు నెలకు రూ.8వేల చొప్పున వేతనాలు ఇస్తున్నారు. వచ్చే కొద్దిపాటి వేతనాలను ప్రతినెల అందించే విధంగా చర్యలు తీసుకోవాలి. నెలల తరబడిగా వేతనాలు ఇవ్వకుంటే మేమెలా బతకాలి. గ్రామంలో ప్రతి పనిని మాతోనే చేయిస్తున్నారు. మా పనిని గుర్తించి సకాలంలో వేతనాలివ్వాలి.
– ముంత నాగన్న, పంచాయతీ కార్మికుడు, ధరూరు

వర్షాల్లేక మెట్ట పంటలు వెలవెల

- వర్షాల కోసం రైతుల ఎదురు చూపు



గట్టు శివారులో రాక ఎదుగుదల లేని వర్షాధార గొర్తివరి



వర్షాల్లేక వాడు పట్టిన కంది పంట

గట్టు: వర్షాధారంగా సాగు చేసుకున్న మెట్ట పంటలు వానల్లేక వాడు పడుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మెట్ట భూముల్లో గొర్తివరి, కమర్షియల్ పత్తి, కందులు, ఆముదాలు, వేరుశనగ, సజ్జ, జొన్న పంటలను రైతులు సాగు చేశారు. వానా కాలం ప్రారంభంలో మురిపించి, ఆ తర్వాత వరుణుడు ముఖం చాటేయ్యడంతో రైతులు లబోదిబోమనే పరిస్థితి ఏర్పడింది. వానా కాలం ప్రారంభమై దాదాపుగా 44 రోజులు గడుస్తున్నా ఇప్పటి దాకా మండలంలో చెప్పుకో తగ్గ వర్షం కురువలేదు. అడపా దడపా కురుస్తున్న వర్షాలకు రైతులు మెట్ట భూములను దుక్కిదున్ని పంటలను సాగు చేసుకున్నారు. జూలై మాసం ప్రారంభమైనప్పటి నుంచి వర్షాలు కనుమరుగు కావడంతో రైతులు మరింత ఆందోళన చెందుతున్నారు. బోర్ల ద్వారా సాగు చేసుకున్న పత్తివిత్తనోత్పత్తి (సీడ్‌పత్తి) మొక్కలు వర్షాల్లేక ఎర్ర బారుతుండడంతో సీడ్ రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాధారంగా పండించే గొర్తివరి పైకి ఎదగ లేక, ఎండిపోలేక మధ్యలో కొట్టుమిట్టాడుతోంది. కందులు, ఆముదాలు, వేరుశనగ పంటలు వానల్లేక వాడుముఖం పడుతున్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే తిండి గింజలకు ఇబ్బంది పడే పరిస్థితి రావచ్చని రైతులు ఆందోళన చెందుతున్నారు. వరుణుడు కరుణిస్తే సమస్యల నుంచి గట్టెక్కుతామని, లేక పోతే పెట్టుబడి కూడా చేతి కందక పోవచ్చని వాపోతున్నారు.

విద్యావ్యవస్థపై దృష్టి పెట్టాలి

గద్వాల అర్బన్: ప్రభుత్వం విద్యావ్యవస్థపై దృష్టి పెట్టాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సురేష్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజాప్రతినిధులను తమ పార్టీలోకి చేర్చుకోవడంపై ఉన్న శ్రద్ధ విద్యావ్యవస్థపై లేదన్నారు. వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించాలని, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, లేదంటే ఏబీవీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున్న ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతలు పూడ్చండి



షేకుపల్లి వెళ్లే దారిలో రోడ్డుకు ఇరువైపులా ఏర్పడిన గుంతలు

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండల కేంద్రం నుంచి షేకుపల్లికి వెళ్లే దారిలో ఆర్అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా వర్షపు నీరు పారి ప్రమాదకరంగా గుంతలు ఏర్పడ్డాయి. దీనివల్ల ఆ దారిలో గ్రామాలకు వెళ్లే వాహనదారులు నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో గుంతలు కన్పించకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరిగి వాహనదారులు గాయపడుతున్నారు. గుంతలు పూడ్చాలని పలుమార్లు స్థానిక అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా ఏర్పడిన గుంతలను పూడ్చి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఆదిశిలాక్షేత్రంలో ఎమ్మెల్యే దంపతుల పూజలు



ఆదిశిలా క్షేత్రంలో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి దంపతులు

మల్దకల్: ఆదిశిలా క్షేత్రంలో లక్ష్మీవేంకటేశ్వర స్వామిని శనివారం గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, అర్చకులు వారికి స్వాగతం పలికారు. ఆలయ విశిష్టతను వివరించి స్వామి వారి తీర్థ ప్రసాదాలను వారికి అందజేశారు. శేషవస్త్రంతో ఎమ్మెల్యే దంపతులను సత్కరించి స్వామివారి మెమోంటోను ఆలయ నిర్వాహకులు అరవిందరావు అందజేశారు. ఎమ్మెల్యే వెంట నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, అజయ్, ఆలయ సిబ్బంది ఉన్నారు.

ఎమ్మెల్యేను సన్మానించిన గ్రామస్తులు

గట్టు: గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిని శనివారం ఆరగిద్ద గ్రామస్తులు గద్వాలలో కలిసి సన్మానించారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా వారు ఎమ్మెల్యేను కలిసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకటేష్, మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్, ఆరగిద్ద యూత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మార్కెట్ సబ్‌యార్డ్‌లో సీసీ బెడ్ నిర్మించండి



మార్కెట్ సబ్ యార్డ్‌లో సీసీ బెడ్ నిర్మించాల్సిన ప్రదేశం

అయిజ: రైతులు పండించిన పంటలను విక్రయించేందుకు మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ సబ్‌యార్డ్‌కు వస్తుంటారు. ప్రభుత్వ రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించి కొనుగోలు కేంద్రాలను వ్యవసాయ మార్కెట్ సబ్‌యార్డ్‌లో ఏర్పాటు చేస్తుంది. ఇక్కడ సీసీబెడ్ నిర్మించకపోవడంతో రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. అకాల వర్షాలు కురిస్తే రైతులు తెచ్చిన ధాన్యం తడిసి ముద్దవుతుంది. ధాన్యపు రాశులపై ప్లాస్టిక్ కవర్ కప్పినా, కిందనుంచి వర్షం నీరు రావడంతో ధాన్యం తడిసిపోతుంది. దాని వల్ల ధాన్యం విక్రయానికి పనికిరాకుండా పోతుందని రైతులు వాపోతున్నారు. వ్యవసాయ అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి వ్యవసాయ మార్కెట్ సబ్‌యార్డ్‌లోని మైదానంలో సీసీ బెడ్ నిర్మించాలని రైతులు కోరుతున్నారు.

దర్శకుడిని కలిసిన శాంతినగర్ వాసులు



దర్శకుడు నాగ శశిధర్‌రెడ్డిని సన్మానిస్తున్న సేవాసమితి సభ్యులు

శాంతినగర్: ప్రముఖ దర్శకుడు నాగ శశిధర్‌రెడ్డిని శాంతినగర్ సేవాసమితి సభ్యులు షేక్ అస్లాం షరీఫ్, దాసువరం నాగరాజులు శనివారం కర్నూలులో కలిశారు. ఈ సందర్భంగా లఘుచిత్రాలు, పెద్ద సినిమాల గురించి దర్శకునితో ముచ్చటించారు. శాంతినగర్ పరిసర ప్రాంతాల్లోని యువకులు లఘుచిత్రాలు తీస్తున్నారని, ప్రతిభ ఉన్నవారికి ప్రోత్సాహం అందించాలని దర్శకున్ని కోరారు. టాలెంట్ ఉన్నవారిని తప్పకుండా ప్రోత్సహిస్తానని ఈసందర్భంగా వారికి హామీ ఇచ్చినట్లు తెలిపారు. తాను దర్శకత్వం వహించిన సీతారాం సీత్రాలు సినిమా త్వరలో విడుదల అవుతుందని, సినిమాను అందరు ఆదరించాలని కోరారు. అనంతరం దర్శకున్ని సేవాసమితి సభ్యులు శాలువాతో సన్మానించారు.

మహనీయుల జీవితం ఆదర్శం



కళ్యాణమ్మకు నివాళులర్పిస్తున్న డైరెక్టర్ రవిప్రకాశ్, ప్రిన్సిపల్ నాగలక్ష్మి

అలంపూర్: మహనీయుల జీవితాలు విద్యార్థులకు ఆదర్శమని మాంటిస్సోరి పాఠశాల డైరెక్టర్ కేఎస్‌వీ రవిప్రకాష్, పాఠశాల ప్రిన్సిపల్ నాగలక్ష్మి అన్నారు. అలంపూర్ పట్టణంలోని మాంటిస్సోరి పాఠశాలలో వ్యవస్థాపకురాలు కళ్యాణమ్మ వర్ధంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్, ప్రిన్సిపల్ జ్యోతి ప్రజ్వలన చేసి, కళ్యాణమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్, ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఒక సాధారణ మహిళ త్రివిక్రమ రూపం ధరించినట్లు కళ్యాణమ్మ అభివృద్ధికి కృషి చేశారన్నారు. సంకల్పం, సాధన, సాఫల్యం వంటి త్రీ రత్నాలను నమ్మి ఆచరించారని కొనియాడారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మల్దకల్: మండలంలోని బూడిదపాడు, బిజ్వారం విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతు పనుల నిమిత్తం ఆదివారం ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు ఆయా విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అయిజ ఏడీఈ గోవిందు, మల్దకల్ ఏఈ దుర్గాప్రసాద్‌లు తెలిపారు. ఈ విషయాన్ని గ్రామాల ప్రజలు, రైతులు గమనించి విద్యుత్ అధికారులకు సహకరించాలని వారు కోరారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

మానవపాడు: మండలంలోని అమరవాయి, మానవపాడు, చంద్రశేఖర్‌నగర్, శ్రీనగర్, కొర్విపాడు స్టేజీల వద్ద శనివారం ఎస్‌ఐ చంద్రకాంత్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. వాహనదారులు హెల్మెంట్ ధరించాలన్నారు. నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తప్పవన్నారు. తనిఖీలో పోలీసులు, సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌ను సన్మానించిన నాయకులు



ఎర్రవల్లిచౌరస్తా: రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌గా ఇటీవల ఎన్నికైన శివసేనారెడ్డిని శనివారం జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దీపక్ ప్రజ్ఞ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ ఇండోర్ స్టేడియంలో పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం అలంపూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జోగుల రవి, తదితరులు కలిసి పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట శ్రీనివాసులు, చంద్రుడు, రాజ్‌కుమార్, కృష్ణకాంత్, నరసింహ, ప్రభాకర్, సిరాజ్, ఉమర్, ఫిరోజ్, తదితరులు ఉన్నారు.

వన మహోత్సవానికి సిద్ధం



సోంపురం నర్సరీల్లో సిద్ధంగా ఉన్న మొక్కలు

- స్థలాలను గుర్తించిన అధికారులు
- ఉపాధిహామీ కూలీలతో గుంతలు తీయించేందుకు ఏర్పాట్లు

కేటీదొడ్డి: వన మహోత్సవానికి అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. గత ప్రభుత్వం తెలంగాణకు హరితహారం పేరుతో కార్యక్రమాన్ని చేపట్టగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వన మహోత్సవం పేరుతో మొక్కలు నాటేందుకు శ్రీకారం చుడుతోంది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు ప్రణాళికలు తయారు చేస్తున్నారు. ఇందుకు అవసరమైన మొక్కలను ఇప్పటికే గ్రామాల్లోని నర్సరీల్లో సిద్ధం చేశారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో వన మహోత్సవం ప్రారంభానికి ఆయా గ్రామాల్లో మొక్కలు అందుబాటులో ఉంచే విధంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

నర్సరీల్లో మొక్కలు పెంపకం..

మండలంలోని 23 గ్రామాల్లో అధికారులు వన నర్సరీలు ఏర్పాటు చేయించారు. వన మహోత్సవంలో భాగంగా మండలంలో మొత్తం రూ.2.30 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఈ మేరకు ఒక్కో నర్సరీల్లో 10వేల మొక్కల చొప్పున పెంచుతున్నారు. నాటిన అనంతరం కొన్ని మొక్కలు ఎండిపోతే వాటి స్థానంలో కొత్తవి నాటేందుకు అదనంగా పెంచుతున్నారు. ఈ నర్సరీల్లో గ్రామ అవసరాలకు అనుగుణంగా కానుగ, ఉసిరి, వేప, రావి, నల్లమద్ది, చింత, కరివేపాకు, జామ, సీతాఫలం, నేరేడు, దానిమ్మ, గన్నేరు, గులాబీ తదితర మొక్కలు పెంచేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

తొలకరి వర్షాలు కురుస్తుండటంతో..

ప్రస్తుత వర్షాలు కురుస్తుండటంతో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉపాధి కూలీలతో గుంతలు తీయించేందుకు యుద్ధ ప్రాతి పదికన ఏర్పాట్లు చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణలో వన సేవకులు, ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రతిరోజు నర్సరీల్లో ఉంటూ పనులు చేయిస్తున్నా రు. సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు.

గ్రామస్తులు సహకరించాలి..



వర్షాలు కురుస్తుండటంతో మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లోని నర్సరీల్లో మొక్కలు పెంచుతున్నాం. ప్రతి నర్సరీల్లో 10 వేల మొక్కలు పెంచాం. ప్రస్తుతం మొక్క లు నాటే దశకు ఎదిగాయి. నాటిన ప్రతి మొక్క బతికేలా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి గ్రామంలో గ్రామస్తులు, యువత, అధికారులు సహకరించాలి.
– అనిల్‌కుమార్, ఏపీఓ, కేటీదొడ్డి

ఆదిశిలాక్షేత్రంలో భక్తుల ప్రత్యేక పూజలు



ఆదిశిలా క్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు

మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఈ సందర్భంగా వివిధ గ్రామాలు, పట్టణాల నుంచి వచ్చిన భక్తులతో ఆదిశిలాక్షేత్రం పోటెత్తింది. సద్దలోనిపల్లి కృష్ణస్వామి, కుర్తిరావులచెర్వు గట్టు తిమ్మప్ప, శేషంపల్లి శివసీతారామస్వామి, చర్లగార్లపాడు వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామి వారికి దాసంగాలు పెట్టి నైవేద్యాలు సమర్పించారు. ఆదిశిలా క్షేత్రం, కృష్ణస్వామి ఆలయాలలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, అరవిందరావు, చంద్రశేఖర్‌రావు, నాగరాజుశర్మ, ఆలయ సిబ్బంది ఉరుకుందు, శ్రీను, రంగస్వామి, శివమ్మ, కృష్ణ, వాల్మీకి పూజారులు తదితరులు పాల్గొన్నారు.

శాంతినగర్ సీఐగా టాటా బాబు

శాంతినగర్: శాంతినగర్ సర్కిల్ సీఐగా టాటా బాబు శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో శాంతినగర్ సీఐగా విధులు నిర్వహించిన సీఐ రత్నం బదిలీ కావడంతో ఆయన స్థానంలో సీఐగా టాటా బాబు శాంతినగర్ సర్కిల్ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా సీఐని పోలీసులు, ఆయా మండలాల ఎస్‌ఐలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

చినుకు పడితే చిత్తడే!



ధరూరులోని ఎరుకలి వీధి వద్ద ప్రధాన రోడ్డు దుస్థితి

ధరూరు: అంతర్రాష్ట్ర రహదారి గద్వాల – రాయచూర్ ప్రధాన రహదారిలో చిన్నపాటి వర్షం కురిసినా రోడ్డంతా చిత్తడిగా మారి రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. మండల కేంద్రంలోని ఎరుకలి వీధి వద్ద ప్రధాన రోడ్డు గుంతలమయంగా మారడంతో ఏటా అధికారులు మట్టిని వేయించి కాలం వెళ్లదీస్తున్నారు. శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి రోడ్డుపై పెద్ద ఎత్తున నీరు చేరి రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తోంది. రోడ్డుకు ఇరు వైపులా కాల్వలు తవ్వించడంతో పాటు నీళ్లు నిలుస్తున్న ప్రాంతం నుంచి వైఎస్సార్ చౌక్ వరకు సీసీ రోడ్డు వేయాలని వాహనదారులు కోరుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వాహనదారులకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరుతున్నారు.